పరిహారం ఎప్పుడో?

- ధర్పల్లి మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- నెలన్నర రోజులు గడుస్తున్నా పరిహారం ప్రకటించని ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న రైతులు



నడిమితండాలో పంట పొలాల్లో వేసిన ఇసుక మేటలు (ఫైల్)

ధర్పల్లి : ధర్పల్లి మండలంలో ఆగస్టు 28న కురిసిన భారీ వర్షాలు రైతులను అతలాకుతలం చేశాయి. వర్షాలతో వరద ప్రవాహానికి పంట పొలాల్లోకి ఇసుకమేటలు, భారీ వృక్షాలు కొట్టుకు వచ్చాయి. పొలాలు కోతకు గురికాగా , మరి కొన్ని చోట్ల బోరు మోటార్లు, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు , విద్యుత్ స్తంభాలు వరద తాకిడికి కొట్టుకుపోయి రైతులకు తీరని నష్టాన్ని మిగిలించింది. ధర్పల్లి మండలంలోని సుమారు 610 ఎకరాల్లోనే పంటలకు నష్టం జరిగినట్లు సమాచారం. భారీ వర్షం పడడంతో హోన్నాజీపేట్ అటవీ ప్రాంతంలోని ముత్యాల చెరువు తెగిపోవడంతో దాని దిగువన ఉన్న బీరప్ప తండా, నడిమి తండా, హోన్నాజీపేట్, వాడి గ్రామాల పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు భారీ వరద తాకిడికి వందల ఎకరాల్లో పంట పొలాలు కోతకు గురి కాగా, రాళ్లు, ఇసుకమేటలు వేశాయి. స్పందించిన ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రకటించింది. ఆ మేరకు అధికారులు ప్రాథమిక అంచనా వేసి నష్టం వివరాలను సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నెలన్నర అవుతున్న ఇప్పటివరకు నెరవేరలేదు. నెలన్నరగా నష్టపరిహారం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కొన్నిచోట్ల పంట పొలాల్లో వేసిన ఇసుకమేటలను ఉపాధి హామీ పథకంలో తొలగించడానికి అధికారులు అంచనాలను రూపొందించిన పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారంతో పంట పొలాల్లో వేసిన ఇసుకమేటలను తొలగించాలని రైతులు వేడుకుంటున్నారు.



వరదకు పొలాల్లోకి కొట్టుకువచ్చిన వృక్షం (ఫైల్)

తీవ్రంగా నష్టపోయాం



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముత్యాల చెరువు తెగిపోవడంతో పంటలు కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయాం. పంట పొలాల్లో ఇసుకమేటలు, రాళ్లతో నిండిపోయాయి. వీటిని తొలగించుకోవడం తమతో సాధ్యం కాదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– భూక్య బాలు, రైతు, బీరప్ప తండా

నష్టపరిహారం వెంటనే అందించాలి



నెలన్నర రోజులు అవుతున్న పంట నష్టపరిహారం అందించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుంది. భారీ వరదకు నాలుగు ఎకరాల్లో ఇసుకమేటలు వేశాయి. పూర్తిగా నష్టపోయాను. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టపరిహారాన్ని అందజేయాలి.

– బనావత్ రాములు, రైతు, నడమి తండా

బెస్ట్ అవైలబుల్ బకాయిలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ..

ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలోని బెస్ట్ అవైలబుల్ స్కీం బాధిత పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత కలెక్టరేట్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి ధర్నా చౌక్ వద్దా ధర్నా చేశారు. ఈ సందర్భంగా బెస్ట్ అవైలబుల్ స్కీం పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు బొర్రా నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మూడేళ్ల నుంచి బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను విడుదల చేయడం లేదన్నారు. ప్రభుత్వం రూ. 210 కోట్లను ప్రైవేట్ పాఠశాలలకు బకాయి పడిందన్నారు. అక్టోబర్ 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు సమ్మె చేస్తున్నాయన్నారు. ఎమ్మెల్సీ పీసీసీ మహేష్ కుమార్ గౌడ్, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బాబు, బీఎస్పీ ఈసీ నెంబర్ అడ్వకేట్ ఈశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్ రాములు, ఎన్సీపీ జిల్లా కార్యదర్శి విఠల్ నాయక్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, ఏబీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బోడ అనిల్, డీఎస్ఎఫ్ జీవన్ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సిరివెని సంతోష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు విజయకుమార్, విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ అన్నారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా లోని ధర్నా చౌక్ వద్ద బెస్ట్ అవైలెబుల్ విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను విడుదల చేసి విద్యార్థులను తిరిగి పాఠశాలలకు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా నాయకులు రెహాన్, సజన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి



ధర్పల్లి : గ్రామంలో ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని, ఈ నెలాఖరులోగా 100 శాతం పన్నులు వసూలు చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని దమన్నపేట గ్రామ పంచాయతీలో రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని పేర్కొన్నారు. గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి సాయి, సిబ్బంది ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



ధర్పల్లి: మండల కేంద్రంలోని బంజారా సేవా సంఘం లో సోమవారం హైమాస్ట్ లైట్లను బంజారా సంఘం నాయకులు ప్రారంభించారు. ఈ లైట్లను ఎంపీ కే.ఆర్ సురేష్ రెడ్డి నిధులతో ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. కె.ఆర్ సురేష్ రెడ్డితో పాటు ధర్పల్లి మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌కు బంజార నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం మండల స్వామి, డివిజన్ అధ్యక్షులు శంకర్ నాయక్, నాయకులు లాల్ సింగ్, అన్వేష్, శ్రీరామ్ నాయక్, లచ్చిరాం, బాలు నాయక్, నరేందర్ నాయక్, మోహన్ నాయక్ ,రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యను అభ్యసించిన 2010– 11 పదోతరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలలో సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరు ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమానికి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదాశివ్, మధుసూదన్ రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

బోధన్ : ఎడపల్లి మండలంలోని ధర్మారంలో సోమవారం ఎస్ బీఐ సౌజన్యంతో విడ్స్(వలంటీర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్ మెంట్ సొసైటీ) ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అంశం పై మహిళ పొదుపు సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ నిజామాబాద్ సీఎఫ్ ఎల్ కౌన్సిలర్ పవన్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వ బీమా పథకాల ప్రాముఖ్యత,బ్యాంక్ ఆర్థిక లావాదేవీలపై జాగ్రత్తలను వివరించారు. ఎడపల్లి ఏఎస్సై చందర్ సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలమయంగా కాలూర్, ఖానాపూర్ రోడ్డు



కంకర తేలిన రోడ్డు (ఇన్‌సెట్‌లో రోడ్డుపై ఉన్న గుంతలు)

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ రూరల్: మండల పరిధిలోని ఖానాపూర్, కాలూర్ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బైపాస్ రోడ్డు నుంచి ఖానాపూర్, కాలూర్ వెళ్లే రోడ్డు దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో అనేక గుంతలు ఉన్నాయి. రోడ్డుపూర్తిగా కంకర తేలింది. రోడ్డు గుండా ప్రయాణిస్తే దుమ్ముధూళి లేస్తోంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు గుంతల్లో దిగబడుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవాలి

అధికారులు పట్టించుకోని ఖానాపూర్, కాలూర్ రోడ్డు మరమ్మతులు త్వరగా చేయాలి. వాహనదారుల అవస్థలను గుర్తించి సమస్యలను పరిష్కరించాలి.

–అగ్గు భోజన్న, కాలూర్ మాజీ సర్పంచ్

విద్యుత్ దీపాలు లేవు

ఖానాపూర్, కాలూర్ రోడ్డు మార్గంలో విద్యుత్ దీపాలు లేవు. దీంతో రాత్రివేళలో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించాలి.

–కోర్వ గంగాధర్, ఖానాపూర్ మాజీ సర్పంచ్

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



డిచ్‌పల్లి : సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డిచ్‌పల్లి ఎస్ ఐ–2 సుమనారెడ్డి సూచించారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాలతో సోమవారం డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాదారులకు పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై 2 సుమనారెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల బ్యాంకు ఖాతాదారులు సైబర్ నేరాల కారణంగా తమ డబ్బును నష్టపోతున్నారని, ఈ విషయమై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరం కింద డబ్బులు నష్టపోతే గంటలోపు 1930 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. గంటలోపు తెలియజేస్తే డబ్బులు ఏ ఖాతాకు లింకు వెళ్లిందో ఆ ఖాతాను ఫ్రీజ్ చేసే అవకాశం ఉందని వివరించారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని పోలీస్ శాఖ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామని సైబర్ వారియర్ నిర్మల జ్యోతి తెలిపారు. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ భాస్కర్, ఖాతాదారులు, హెడ్ కానిస్టేబుల్ ఉషన్న తదితరులున్నారు.

క్లుప్తంగా

బీసీ బంద్‌కు సహకరించాలి



నిజామాబాద్‌నాగారం : ఈ నెల 18 తలపెట్టిన బీసీ బంద్‌కు సహకరించాలని నిజామాబాద్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మాస్టర్ శ్రీనివాస్‌ని కలిసి బీసీ సంఘాల ప్రతినిధులు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం ఇవ్వాదాల్సిన 42 శాతం రిజర్వేషన్లను కొందరు కోర్టులో పిటిషన్ వేసి అడ్డుకున్నారని విమర్శించారు. బంద్‌కు సహకరించాలని నిజామాబాదులోని పలు సంస్థల ప్రతినిధులను కలిసి కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, పోల్కం గంగా కిషన్, కరిపె రవీందర్, దర్శనం దేవేందర్, కొయ్యడ శంకర్, బాలన్న, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూపతిరెడ్డిని పరామర్శించిన ఇంద్రకరణ్‌రెడ్డి

నిజామాబాద్ రూరల్ : నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌లో గల ఎమ్మెల్యే నివాసంలో నిజామాబాద్ రూరల్ ఎమెల్యే ఆర్ భూపతిరెడ్డిని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. భూపతిరెడ్డి తల్లి రేకులపల్లి లక్ష్మి నర్సమ్మ గత నెల 29న మృతిచెందిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా లక్ష్మి నర్సమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. సీనియర్ నాయకులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



ఇందల్వాయి: ఇందల్వాయి పీఏసీఎస్ పరిధిలోని ఇందల్వాయి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో రాజేంద్ర కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, తహసీల్దార్ వెంకట్ రావు, పీఏసీఎస్ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

కేటగిరి వారీగా జాబితా రూపొందించాలి



కమ్మర్‌పల్లి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను కేటగిరిల వారీగా జాబితాను రూపొందించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన కమ్మర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను పరిశీలించారు. గ్రామాల వారీగా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా నివేదిక తయారు చేయాలని సూచించారు. రికార్డుల గదిని పరిశీలించి, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ శరత్, జీపీవోలు ఉన్నారు.

రైతులు మద్దతు ధరను పొందాలి

మాక్లూర్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని రైతులు మద్దతు ధరను పొందాలని తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో గంగాధర్ అన్నారు. మండలంలోని డీకంపల్లి, రామస్వామి క్యాంపులలో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం వారు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి దినేష్, మండల సమైక్య ఏపీఎం ఉమా కిరణ్, సీసీ రాజా రమేశ్, తదితరులున్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,30,700	వెండి(కిలో)	1,91,000
22 క్యారెట్స్	1,20,435		– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సింగ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	32	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	80
బీరకాయ	50	100	దోసకాయ	30	60
దొండకాయ	50	100	ఆలుగడ్డ	30	60
బీర్నిసుకాయ	100	180	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	100
వంకాయ	40	80	బీట్‌రూట్	40	80
పాలకూర	80	160	కరివేపాకు	40	80
మెంతికూర	100	180	చామగడ్డ	30	60
కొత్తిమీర	80	160	చిక్కుడుకాయ	30	60
పుదీనా	50	100	గోరుచిక్కుడు	50	100
క్యాప్సికం	50	100			

–సుభాష్‌నగర్

చిరుధాన్యాలను కచ్చితంగా తినాలి



రామడుగులో సీమంతాలు చేస్తున్న అధికారులు

ధర్పల్లి/ సిరికొండ : ప్రతి కుటుంబం పోషకాహార లోపాన్ని తరిమి కొట్టాలని, ప్రతి ఒక్కరూ ఆకుకూరలు, చిరుధాన్యాలను కచ్చితంగా తినాలని తహసీల్దార్ శాంతా అన్నారు. మండలంలోని రామడుగు రైతు వేదికలో సోమవారం మండల స్థాయి పోషణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి తహసీల్దార్ శాంత, ఐసీడీఎస్ డిచ్‌పల్లి ప్రాజెక్ట్ అధికారి జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై పోషణ మాస కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మంచి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రసాన , అక్షరాభ్యాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బుజ్జి, సరిత హెల్త్ సూపర్‌వైజర్ భూలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గర్భిణులకు బాలింతలకు వారి ఆరోగ్య సంరక్షణపై వివిధ జాగ్రత్తలను సూచించారు. మెడికల్ ఆఫీసర్ అరవింద్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సవిత, అరుణకుమారి, నాగలక్ష్మి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కాలేజీలో ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్



కంజర్ గురుకులంలో చార్ట్‌లు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

మోపాల్: మండలంలోని కంజర్ శివారులోగల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో పీఎం శ్రీలోభాగంగా ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్ అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్యానా (తెలంగాణ పార్ట్‌నర్ స్టేట్) రాష్ట్ర విశేషాలపై విద్యార్థులకు వివిధ రకాల పోటీలు ఏర్పాటుచేశారు. అనంతరం ప్రిన్సిపాల్ విజయలలిత మాట్లాడుతూ ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమంలో భాగంగా హర్యానా రాష్ట్ర సంస్కృతీ సాంప్రదాయాలను, ఆ రాష్ట్ర గొప్పదనాన్ని వివరించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

అంతకుముందు విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌వీపీ రూపాని, జేవీపీ సునీత, సీనియర్ పీడీ ఉదయశీల, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలి



అవగాహన కల్పిస్తున్న ఏంఎవో బాలకృష్ణ

మోపాల్ : విద్యార్థులను కేవలం చదువుపైనే కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రోత్సహించాలని ఏఎంవో బాలకృష్ణ, హెచ్ఎం శంకర్ సూచించారు. సోమవారం నగరశివారులోని బోర్గాం(పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు రెండ్రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. చదువుతో పాటు మానవతా విలువలు కూడా నేర్పించాలని, మైనర్లకు వ్యక్తిగత శుభ్రత, శరీర పెరుగుదలలో మార్పులు, దాని పర్యావసనాల గురించి వివరించాలని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శిక్షణలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ద్వారా జరిగే నేరాలను ఎలా అరికట్టాలి అనే అంశాలను వివరిస్తామన్నారు. ప్రతి పాఠశాలలో పిల్లలతో విద్యార్థి జాగృతి సంఘాలు ఏర్పాటు చేసి అవగాహన, నివారణ, వంటి విషయాలపై సదస్సులు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజ్వల సీనియర్ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్, రిసోర్స్ పర్సన్స్ రమాదేవి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

నిజామాబాద్ సిటీ : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్‌చేస్తూ వారికి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ కోరారు. సోమవారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని ఏఎన్ఎంలు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్‌లు, ఆరోగ్య మిత్రలు, 104 ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఏఎన్ఎంల పని భారం తగ్గించాలని,1,930 ఏఎన్ఎం పోస్టులు, 2,300 నర్సింగ్ ఆఫీసర్స్, 1,284 ఎల్‌టీ, 735 ఫార్మసిస్ట్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య మిత్రల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కారం చేయకుంటే భవిష్యత్తులో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నూర్జహాన్, మురళి, సావిత్రి, ధనలక్ష్మి, రాము గౌడ్, జీవన్‌రెడ్డి, రమేష్, సురేష్, ప్రసాద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మంచి జీవన శైలిని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామోహ్మన్‌రావు

ఖలీల్‌వాడి: విద్యార్థులు మంచి జీవన శైలిని అలవర్చుకోవాలని జీజీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామోహ్మన్‌రావు అన్నారు. నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఎన్ సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎన్‌జీవో లయన్స్ క్లబ్ సంస్కృతి, హైదరాబాద్, ప్రభుత్వ ఆరోగ్యశాఖ నిజామాబాద్ సహకారంతో సోమవారం విద్యార్థులకు, 'మెంటల్ వెల్నెస్, మెంటల్ హెల్త్ అవగాహన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం, ఆరోగ్యం కాపాడుకుంటేనే ఏదైనా సాధించగలమన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ రవితేజ మాట్లాడుతూ సెల్ ఫోన్‌తో అధిక సమయం గడపడంతో మానసిక రుగ్మతలు వస్తున్నాయన్నారు. ఆరోగ్యశాఖ ట్రైనర్స్ సులోచన, వెంకటేశ్వర్లు మానసిక ఆరోగ్య విషయాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రంగరత్నం, అకాడమిక్ కోఆర్డినేటర్ నహీదా బేగం, పీఆర్ఓ. డాక్టర్ దండుస్వామి, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఎం. రామస్వామి, ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్స్, నాగజ్యోతి, రజిత, సుధాకర్, దస్తప్ప, నరేష్ కుమార్, వెంకట రమణ, ఫిజిక్స్ విభాగం అధిపతి రామకృష్ణ, అధ్యాపకులు శ్రీనివాస్, శమంత, రాధిక, అర్చన, కె. గంగాధర్, విద్యార్థులు, ఎన్‌సీసీ కెడేట్స్, ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ పాల్గొన్నారు.

17న సాయిబాబా ఆలయంలో బహిరంగ వేలం

నిజామాబాద్ రూరల్ : మండలంలోని మాధవనగర్ సాయిబాబా ఆలయంలో పులిహోర, లడ్డు ప్రసాదాలకు ఈనెల 17న ఆలయ ప్రాంగణంలో బహిరంగవేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీరాంరవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 1.11.2025 నుంచి 31.10.2026 సంవత్సరానిగాను పులిహోర, లడ్డు అమ్మకాలకు బహిరంగవేలం నిర్వహించనున్నారు. ముందుగా రూ.20వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.